క్లుప్తంగా

నేటి నుంచి పెనుమూరులో గడప గడపకు..

పెనుమూరు (చిత్తూరు అగ్రికల్చర్): మండలకేంద్రం పెనుమూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని ఉదయం 7 గంటలకు స్థానిక శివాలయం నుంచి ప్రారంభించి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల అమలును ప్రజలకు వివరిస్తూ, ఏదైనా సమస్యలు ఉంటే తెలుసుకుంటారు. సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తారు.

ఆరేటమ్మ ఆలయంలో అన్నదానం



ఆరేటమ్మ ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న దాతలు

పుత్తూరు రూరల్: గ్రామదేవత ఆరేటమ్మ ఆలయంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాచపాళెం గ్రామానికి చెందిన ఎస్.ప్రకాష్‌రాజు, రమణమ్మ, ఎస్.కిశోర్, ప్రవళ్లిక దంపతులు పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేపట్టారు. పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ కె.మనోహర్‌రెడ్డి పర్యవేక్షించారు.

వైస్ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ



వైస్ సర్పంచ్ వెంకటేశ్ భార్య, పిల్లలను ఓదారుస్తున్న మంత్రి రోజా

నగరి : గుండెపోటుతో అకస్మాత్తుగా మృతిచెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, వైస్ సర్పంచ్ వెంకటేశ్ మృతదేహానికి మంత్రి ఆర్‌కే రోజా మంగళవారం నివాళులర్పించారు. ఉదయం వెంకటేశ్ స్వగృహానికి చేరుకున్న ఆమె అతని మృతదేహంపై పూలమాలలను వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వారి కుటుంబసభ్యులను ఓదార్చారు. తండ్రి కోసం విలపిస్తున్న వెంకటేశ్ బిడ్డలను చూసి మంత్రి రోజా కూడా కళ్లు చెమర్చారు. పార్టీ తరఫున అండగా ఉంటామంటూ వారికి భరోసా ఇచ్చారు. మంత్రి వెంట ఎంపీపీ భార్గవి, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, మున్సిపల్, మండల నాయకులు పాల్గొన్నారు.

ఓరుగుంటాలమ్మకు పొంగళ్లు



పొంగళ్లను ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

నగరి : పట్టణ పరిధిలోని కొత్తపేట కొళ్జిర్ వీధికి చెందిన ప్రజలు మంగళవారం గ్రామదేవత ఓరుగుంటాలమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. మేళతాళాల మధ్య ఊరేగింపుగా వెళ్లి ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి అమ్మవారికి సమర్పించారు. భక్తులకు అన్నదానం చేశారు.

వైభవంగా కల్యాణోత్సవం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పురోహితులు

నగరి : మున్సిపల్ పరిధిలోని చింతలపట్టెడ ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో నిర్వహిస్తున్న తిరనాళ్లలో భాగంగా మంగళవారం కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ నిర్వాహకులు డాక్టర్ నటరాజన్ కుటుంబ సభ్యులు కల్యాణోత్సవానికి ఉభయదారులుగా వ్యవహరించారు. ఇంటి వద్ద నుంచి సంప్రదాయబద్ధంగా సారెను తీసుకువచ్చి వేదమంత్రోచ్చరణల నడుమ అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పుష్పాలతో, విద్యుత్ దీపాలతో, అరటి చెట్లతో సుందరంగా అలంకరించారు. ద్రౌపదీ సమేత ధర్మరాజ స్వాములను సారెతెచ్చిన పట్టువస్త్రాలతో, ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. పురోహితులు ప్రసాద్ శర్మ కల్యాణోత్సవ వేడుకలను నిర్వహించారు. ఉభయదారులు భక్తులకు అన్నదానం చేశారు.

ఎల్ఐసీ ఉద్యోగుల నిరసన



పుత్తూరు రూరల్: ఎల్ఐసీ ఉద్యోగులు మంగళవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి ఎస్.లక్ష్మణకుమార్ మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులకు ఫ్యామిలీ పెన్షన్‌ను 15 శాతం నుంచి 30 శాతం వరకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎల్ఐసీ బోర్డు నాలుగేళ్ల క్రితమే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. అయితే నేటికీ కేంద్ర ప్రభుత్వం దీనిపై ఆమోదం తెలపకపోవడం విచారకరమన్నారు. బ్రాంచ్ మేనేజర్ పి.భాను, అధికారులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమమే లక్ష్యంగా సురక్షితమైన పాలన

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం మండలంలో తొమ్మిది సచివాలయాల పరిధిలో విజయవంతంగా ముగిసింది. వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు రూపాయి ఖర్చులేకుండా అధికారులు, ప్రతినిధులు అందజేశారు. జగనన్న సురక్ష పథకం అమలుపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- జగనన్న సురక్షతో అర్హులందరికీ ధ్రువీకరణ పత్రాలు
- సచివాలయ వ్యవస్థతో మరింత మెరుగైన సేవలు
- రూపాయి ఖర్చు లేకుండా.. ఆఫీసులకు తిరిగే పనిలేకుండా ఉన్న చోటే అందజేత
- పాలసముద్రం మండలంలో 19,299 మందికి ధ్రువపత్రాల జారీ
- లబ్ధిదారుల హర్షాతిరేకాలు



జగనన్న సురక్షలో ధ్రువీకరణ పత్రాలు అందుకున్న లబ్ధిదారులతో అధికారులు, ప్రజాప్రతినిధులు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు

గ్రామ సచివాలయాలు –	9
కులధ్రువీకరణ పత్రాలు –	1,848
ఆదాయ ధ్రువీకరణ పత్రాలు –	1,840
ఆధార్ సేవలు –	75
1బి –	40
రేషన్ కార్డులు –	3
కుటుంబ సభ్యుల సర్టిఫికెట్లు –	5
వివాహ ధ్రువీకరణ పత్రాలు –	9
జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలు –	3877
సర్వే చేసిన కుటుంబాలు –	4123

పాలసముద్రం : ప్రజల అర్హతలు, అవసరాలు తెలుసుకుని వాటిని సకాలంలో సమకూర్చడం ప్రభుత్వం బాధ్యత. అలా నెరవేర్చగలిగేదే ప్రజా ప్రభుత్వం. అలా కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ పథకాలు అందించిన ప్రజా నాయకులు నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి అయితే, నేడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ దిశగా పాలన సాగిస్తున్నారు. అర్హులై కూడా ఏ కారణం చేత అయినా పథకాలు అందక నష్టపోకూడదనే ఉద్దేశంతో రాష్ట్రప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సర్వే జరిపి ఏ కారణంగా పథకం అందలేదో తెలుసుకుని, వారికి కావలసిన సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేయిస్తున్నారు. అధికారులు యుద్ధప్రాతిపదికన ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా వారికి అందేలా చర్యలు తీసుకుంటున్నారు. మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమం అధికారులు, ప్రజాప్రతినిధులు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు బాధ్యతగా పని చేసి విజయవంతం చేశారు. గతంలో ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజలు మండలకేంద్రాల్లోని కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు జగనన్న సురక్షతో తాము గంటల వ్యవధిలోనే ధ్రువీకరణ పత్రాలు పొందుతున్నామని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కుల, ఆదాయ, మరణ ధ్రువీకరణ పత్రాల కోసం అధిక సంఖ్యలో ప్రజలు ముందుకొస్తున్నారు. వాటితో పాటు రేషన్ కార్డుల్లో పేర్ల మార్పు, ఆధార్ ఫోన్ నంబర్ లింక్, బయోమెట్రిక్, ఐరిష్ వంటివి చేయించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు.

ప్రభుత్వ సేవలు బాగున్నాయి..



జగనన్న సురక్షలో వలంటీర్ ఇంటికి వచ్చి మీకు ప్రభుత్వం నుంచి ఏం కావాలని అడిగారు. కుల, ఆదాయ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేయించారు. శిబిరానికి నన్ను పిలిచి మరీ సర్టిఫికెట్లు అందించారు. గతంలో ప్రభుత్వం కార్యాలయాల చుట్టూ తిరిగితే కాని అవి వచ్చేవి కావు. కానీ ఇప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఉచితంగా సర్టిఫికెట్లు పొందాను. – ఉమ, ఆముదాల, దళితవాడ

20 ఏళ్లు ఇబ్బంది పడ్డాను..



కుల, నివాస సర్టిఫికెట్లు లేక గత 20 ఏళ్లుగా ఇబ్బందులు పడ్డాను. గతంలో మీసేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకున్నా కానీ రాలేదు. జగనన్న సురక్ష సర్వేలో వలంటీర్ వచ్చి నాకు అవసరమైన సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేయించారు. ఖర్చు లేకుండా సురక్ష క్యాంపులో కుల, నివాస సర్టిఫికెట్లు పొందాను. – విజయకుమార్, మఠవలం గ్రామం

వ్యయప్రయాసలు లేకుండా..



మాకు కుటుంబ సభ్యుల సర్టిఫికెట్ కావాల్సి ఉంది. లీగల్ హైర్ సర్టిఫికెట్‌ను పొందాలంటే గతంలో చాలా వ్యయప్రయాసలు పడాల్సి వచ్చేదని గ్రామంలో చెబుతున్నారు. నాకు గత వారం టోకెన్ ఇచ్చారు. ఈరోజు జగనన్న సురక్ష కార్యక్రమంలో సర్టిఫికెట్‌ను ఉచితంగా అందజేశారు. ప్రభుత్వానికి, అధికారులకు ఈ పథకాన్ని ప్రవేశ పెట్టిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు. – ఇంద్రాణి, మఠవలం గ్రామం, గృహిణి

ఉచితంగా పొందాను..



జగనన్న సురక్ష శిబిరం ద్వారా కుల, ఆదాయ, నివాస సర్టిఫికెట్లు ఉచితంగా పొందాను. వాస్తవంగా ఈ రెండు సర్టిఫికెట్ల కోసం రూ.500 ఖర్చు వుతుంది. పైగా మీ సేవా కేంద్రాల వద్ద పడిగాపులు కాయాలి. నాలుగు రోజుల క్రితం వలంటీర్లు మా ఇంటికి వచ్చి దరఖాస్తు చేయించారు. ఇప్పుడు సర్టిఫికెట్లు పొందాను. – డిల్లీ, ఆముదాల, దళితవాడ

ప్రతి కుటుంబానికీ ఉపయోగం



మా అబ్బాయి పదో తరగతి పాస్ అయ్యాడు. ఇంటర్ చదవాలనుకుంటున్నాడు. అబ్బాయి ఉన్నత చదువుల కోసం కులం, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న రెండు రోజుల్లోనే మాకు వలంటీర్ తీసుకొచ్చి అందజేశారు. జగనన్న సురక్ష కార్యక్రమం ప్రతి కుటుంబానికి ఎంతో ఉపయోగపడుతోంది. – మునియమ్మ, శ్రీకావేరిరాజుపురం

నాలుగు రోజుల్లోనే చేతికి..



గతంలో నాకు కుల ధ్రువీకరణ పత్రాలు పొందడానికి 15 రోజులు పట్టేది. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు మా ఇంటికి వచ్చి దరఖాస్తు తీసుకున్నారు. నాలుగు రోజుల్లో సర్టిఫికెట్లు నా చేతికి అందించారు. ఈ సేవలకు గానూ నా వద్ద నుంచి ఎటువంటి రుసుం తీసుకోలేదు. – బి.లోకేశ్వరి, శ్రీకావేరిరాజుపురం

'ప్రజలకు మంచి చేసే ప్రభుత్వం మాది'



వృద్ధురాలికి సంక్షేమ పథకాల గురించి ఆరాతీస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

- అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే జగనన్నను మరోమారు ఆశీర్వదించండి
- టీడీపీ నాయకులకు అధికార దాహం తప్ప ప్రజాశ్రేయస్సు పట్టదు
- 14 ఏళ్లు పాలించిన చంద్రబాబు ప్రజలకు ఏం మేలు చేశారు?
- మంత్రి ఆర్‌కే రోజా

నగరి : ఇది ప్రజల బాగు కోరే ప్రభుత్వం అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని చింతలపట్టెడలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆమె పర్యటించారు. స్థానికులు బాణసంచా పేలుళ్ల నడుమ గజమాలలు, దుశ్శాలువలతో హారతులు పట్టి ఆమెను ఆహ్వానించారు. మండల స్థాయి అధికారులతో కలసి ప్రతి గడపకు వెళ్లిన ఆమె నాలుగేళ్లలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరిస్తూ సంక్షేమ బుక్‌లెట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న కాలంలోనూ ఈ సంక్షేమం, అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే సీఎం జగనన్న ప్రభుత్వానికి అండగా నిలవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జగనన్న ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సగటున రూ.2 లక్షలకు పైగా లబ్ధి చేకూర్చారని ఇది ప్రతిపక్షాలకు కంటగింపుగా ఉందన్నారు. ఎలాంటి దుష్ప్రచారాలను నమ్మవద్దని, మేలు చేసిన వారిని గుర్తుంచుకుంటే అభివృదికి బాటలు వేసినవారం అవుతామన్నారు. కరోనా లాంటి కష్టకాలాన్ని అధిగమించి పేదల జీవితాలు సాఫీగా సాగిపోవడానికి ప్రభుత్వం అందించిన చేయూతన గుర్తుంచుకోవాలని కోరారు. టీడీపీ నాయకులకు అధికార దాహం తప్ప ప్రజాశ్రేయస్సు పట్టదన్నారు. పద్నాలుగేళ్లు పాలించిన ఆ పార్టీ ప్రజలకు ఏం మేలు చేసిందో ఆలోచించాలన్నారు. ప్రజలు చెప్పిన సమస్యలను శ్రద్ధగా విన్నారు. వాటి పరిష్కారానికి అప్పటికప్పుడు అధికారులకు ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్‌చైర్మన్ బాలన్, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, మున్సిపల్ పార్టీ కన్వీనర్ బీఆర్వీ అయ్యప్పన్, మున్సిపల్ సచివాలయ కన్వీనర్ దయానిధి, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, హౌసింగ్ డీఈ శంకరప్ప, సీడీపీఓ కృష్ణవేణి, మెప్మా టీఎల్ఎం సునీత, కౌన్సిలర్లు నళిని, ఇంద్రయ్య, మురుగ, నాయకులు నటరాజన్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

దేశమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



దేశమ్మ ఆలయంలో బారులు తీరిన భక్తులు

నగరి : నేత్ర దేవత దేశమ్మకు ఆడి నెల మంగళవారం ప్రత్యేకం కావడంతో ఆలయం భక్తులతో కిక్కిరిసింది. ఆలయానికి విచ్చేసిన భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం ముందున్న అమ్మవారి పాదుకల వద్ద పొంగళ్లు ఉంచి పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులను నియంత్రించడానికి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు. భక్తులు అమ్మవారి దర్శనం చేసుకుని తీర్థం కళ్లలో చల్లుకున్నారు. ఆలయ చైర్మన్ వేణుబాబు, ఈఓ మునికృష్ణయ్య, ధర్మకర్తలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కౌన్సిలర్ దయానిధి, లోకనాథం, సేడు పాల్గొన్నారు.



ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న భక్తులు

'బతికినంతకాలం వైఎస్సార్‌సీపీలోనే ఉంటాం'



వైఎస్సార్‌సీపీలోనే ఉన్నామని చెబుతున్న తిరుమలరాజుపురం దళితవాడ వాసులు

పాలసముద్రం: మేము బతికినంత కాలం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే ఉంటామని మండల పరిధిలోని తిరుమలరాజుపురం దళితవాడకు చెందిన పలువురు అన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శివప్రకాష్ రాజు మంగళవారం తిరుమలరాజుపురం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనతో వారు మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితం తిరుమలరాజుపురం గ్రామానికి చెందిన దాస్ కుటుంబసభ్యులు టీడీపీలో చేరారని పత్రికల్లో వచ్చిందన్నారు. అది అవాస్తవం అని తాము గత 13 ఏళ్లుగా వైఎస్సార్‌సీపీలోనే ఉన్నామన్నారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఇతర పార్టీల నుంచి వచ్చి చేరుతున్నారని తెలిపారు. తాము ఎప్పుడూ వైఎస్సార్‌సీపీలో ఉన్నామని, భవిష్యత్‌లో కూడా ఉంటామని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ జీవిత, వైస్ ఎంపీపీ పుష్ప, నాయకులు ప్రకాష్, భాస్కర్, మనిరత్నంరాజు, చిన్నతంబి, గోవిందస్వామి, లక్ష్మిపతి, అజిత్, వంశిరాజ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్ర సాంకేతికపై ఆసక్తి చూపండి



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు

విజయపురం (నగరి) : శాస్త్ర సాంకేతికపై విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఆసక్తి చూపాలని శ్రీహరిపురం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సోమశేఖర్ అన్నారు. మంగళవారం శ్రీహరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రసాయన శాస్త్రం సదస్సుకు హాజరైన విద్యార్థులకు పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. జూలై 28 నుంచి 30వ తేదీ వరకు తిరుపతి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ కేంద్రంలో జరిగిన రసాయన శాస్త్రం సదస్సులో ప్రతిభ కనబరిచిన కేశవ వర్మ, పాండు నాగయ్య, భాను, భావనప్రియను పేరెంట్స్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవు



కార్వేటినగరం సీహెచ్‌సీలో మెడికల్ స్టోర్‌ను పరిశీలిస్తున్న డీసీహెచ్ఎస్ బీసీకే నాయక్

కార్వేటినగరం: వైద్యాధికారులు నిత్యం రోగులకు అందుబాటులో ఉండాలని, నేటి నుంచి వైద్యాధికారులు రాత్రి పూట కూడా విధుల్లో ఉండాలని, ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని డీసీహెచ్ఎస్ఓ(జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్స్ సర్వీసెస్ అధికారి) బీసీకే నాయక్ హెచ్చరించారు. మంగళవారం ఆమె మండలకేంద్రంలోని సీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పాము, కుక్క కాటుకు సంబంధించిన వ్యాక్సిన్లు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పక్కన ఉన్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రం(పీహెచ్‌సీ) పేరును తొలగించాలని సీహెచ్‌సీఓ సూపరింటెండెంట్ డాక్టర్ భాగ్యలక్ష్మిని ఆదేశించారు. అదేవిధంగా సీహెచ్‌సీలో కంప్లైంట్ బాక్సు, సమాచార హక్కు చట్టం బోర్డు తప్పక ఏర్పాటు చేయాలన్నారు. పలువురు వైద్యాధికారులు మాట్లాడుతూ రాత్రుల్లో విధులు నిర్వహించడానికి సరైన వసతులు లేవని, పాముల బెడద ఎక్కువగా ఉందని డీసీహెచ్ఎస్ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఆయన ఆస్పత్రి ఆవరణలో నిర్మాణం చేపడుతున్న 50 పడకల ఆస్పత్రి పనులను పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, వైద్యాధికారులు మురళి, మీనాక్షి, డాక్టర్ స్మృతిభాగ్యం, వైద్యసిబ్బంది, పలువురు పాల్గొన్నారు.

అన్నివేళలా అందుబాటులో ఉండాలి

నగరి : ప్రభుత్వ వైద్యశాలలో అన్నివేళలా వైద్యసేవలు అందుబాటులో ఉండాలని డీసీహెచ్ఎస్ బీసీకే నాయక్ అన్నారు. మంగళవారం ఏరియా ఆస్పత్రిని ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రి రికార్డులను ఆయన పరిశీలించారు. ప్రతి వార్డులోను పర్యటించి రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరాతీశారు. ల్యాబ్, ఆక్సిజన్ ప్లాంట్‌ను పరిశీలించారు. ఆస్పత్రిలో పారిశుధ్యంపై ప్రత్యేకంగా తనిఖీ చేశారు. అనంతరం వైద్యులతో ఆయన సమావేశమయ్యారు. అడ్మిషన్ అయిన ప్రతి రోగి వివరాలను ఆరోగ్యశ్రీలో అప్‌లోడ్ చేయాలన్నారు. మెడికల్ సూపరింటెండెంట్ ప్రభావతి, ఆర్ఎంఓ ఆర్వీ మంజుల, ఫార్మసీ సూపర్‌వైజర్ ఏవీ ప్రసాద్, వైద్యులు, నర్సింగ్ సూపరింటెండెంట్ రాజరత్నం, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై సమీక్ష



ఓటరు నమోదుపై బీఎల్ఓలకు సూచనలు ఇస్తున్న డిప్యూటీ కలెక్టర్ భవాని

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం) : ఓటరు నమోదులో ఎలాంటి తేడాలు రాకుండా చూడాలని డిప్యూటీ కలెక్టర్ భవాని అన్నారు. బుధవారం మండల కార్యాలయంలో డిప్యూటీ కలెక్టర్ వివిధ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, బీఎల్ఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ నెల 21 నుంచి ఆగస్టు 21 వరకు సమ్మర్ రివిజన్ కార్యక్రమంలో బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ జాబితా ప్రకారం సర్వే నిర్వహిస్తారని తెలిపారు. గ్రామాల్లో లేకుండా, బయట ప్రాంతాల్లో స్థిరపడిన వారిని, అదేవిధంగా మరణించిన వారిని క్షుణ్ణంగా గుర్తించి ఓటర్ జాబితా నుంచి తొలగించాలని ఆదేశించారు. ఇలాంటి కార్యక్రమాలకు ప్రజా ప్రతినిధులు, అన్ని పార్టీలకు చెందిన నాయకులు బీఎల్ఓలకు సహకరించి నకిలీ ఓట్లను తొలగించాలని సూచించారు. బీఎల్ఓలు, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సుబ్రమణ్యస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రమణ్యస్వామి

కార్వేటినగరం: స్కంధ పుష్కరిణి సమీపంలో కుమారగిరిపై వెలసిన వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రమణ్య స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం వల్లీదేవసేన సమేత స్వామివారిని పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. స్వామివారి దర్శనానికి విచ్చేసిన భక్తులకు ఆలయ అధ్యక్షుడు కేశవరెడ్డి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

ఓంశక్తి ఆలయంలో..



పొంగళ్లు తీసుకెళ్తున్న మహిళలు

పాలసముద్రం : మండలంలోని వినాయకపురంలో ఆడి నెల సందర్భంగా మునేశ్వరస్వామికి, మఠవలంలో ఓంశక్తి అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు, వివిధ అభిషేకాలు చేశారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు పొంగళ్లను పెట్టి నైవేద్యం సమర్పించారు. నిశ్శింకాపురంలో ఓంశక్తి అమ్మవారికి అంబలి పోశారు.

పోరాటాలతోనే సాధించుకున్నాం

- చేనేత కార్మిక యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల వాసు



జాతీయ చేనేత దినోత్సవ కరపత్రాలను చూపుతున్న యూనియన్ నాయకులు

నగరి : ఐక్యపోరాటాలతోనే చేనేత కార్మికులకు ఎన్నో పథకాలు వచ్చాయని చేనేత కార్మిక యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల వాసు అన్నారు. మంగళవారం చిత్తూరు జిల్లా అధ్యక్షుడు పిచ్చుక కృష్ణయ్య అధ్యక్షతన, ప్రధాన కార్యదర్శి కందల బాలాజీ నేతృత్వంలో నగరి మండలం మాంగాడు గ్రామంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాల యూనియన్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మిక యూనియన్ గత 32 సంవత్సరాలుగా చేనేతల ఉపాధి సంక్షేమ రక్షణ కోసం నిరంతరం పని చేస్తోందన్నారు. ఐక్య పోరాటం వల్ల చేనేత కార్మికులకు ఎన్నో పథకాలు వచ్చాయని వివరించారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేతల జీవనశైలిపై దృష్టి సారించి మరింత సహకారం అందించాలన్నారు. సమావేశంలో చేనేత కార్మిక యూనియన్ గౌరవ అధ్యక్షుడు కేవీ కుప్పయ్య మాట్లాడుతూ చేనేత కార్మికులకు ఉపాధి భద్రత కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. నేతన్న నేస్తం ఇంకా జమకాని వారి సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని చేనేత కార్మిక యూనియన్ ముద్రించిన కరపత్రాలను, బ్యాడ్జీలను నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా అధ్యక్షుడు జక్కల మునస్వామి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుత్తి త్యాగరాజు, చిత్తూరు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఎన్.శ్రీనివాసులు, సీనియర్ చేనేత నాయకులు పీపీ ఎల్లప్ప, ఏఎన్.సంపత్, జి.గోపాల్, కందల గేరటయ్య శెట్టి, కే.వెంకటరత్నం శెట్టి, ఏ.సంజీవి, బి.శేఖర్, బి.శ్రీనివాసులు, కే.సుధాకర్, బి.లక్ష్మీపతి, మోహన్, కే.జానకి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో చీడపీడల నివారణ



వేరుశనగ పంటకు సోకే చీడపీడల నివారణపై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న ఏఓ డిల్లీప్రసాద్

పాలసముద్రం: వరి, వేరుశనగ పంటలకు సోకే చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులు అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయాధికారి డిల్లీప్రసాద్ తెలిపారు. మంగళవారం పాలసముద్రం గ్రామంలో రైతులకు క్షేత్ర సందర్శనలో భాగంగా వరి, వేరుశనగ సమగ్ర యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏఓ డిల్లీప్రసాద్ మాట్లాడుతూ వరిసాగులో చీడపీడల వల్ల కలిగే నష్టాలు, వాటి సస్యరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. రైతులకు వచ్చే సందేహాలను నివృత్తి చేశారు. ప్రతి రైతు కూడా సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. చీడపీడల నివారణపై రైతులకు అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎప్పటికప్పుడు సాగు సస్యరక్షణ చర్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. రైతులు ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. అనంతరం రైతులు సాగు చేసిన వేరుశనగ పంటను క్షేత్రస్థాయిల్లో పరిశీలించి వివరించారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్ర వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'ను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఇందిర

పుత్తూరు రూరల్: అక్టోబర్ 2 నుంచి ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఇందిర కోరారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 17 ఏళ్ల యువతీ యువకులకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, క్రికెట్, బ్యాడ్మింటన్ క్రీడలను నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. ఏ గ్రామానికి చెందిన క్రీడాకారులు ఆయా గ్రామాల్లో నిర్వహించే పోటీల్లో పాల్గొనాలన్నారు. మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి మాట్లాడుతూ క్రీడల నిర్వహణ పరంగా పుత్తూరుకు మంచి పేరు తీసుకురావడానికి అధికారులు అందరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓలు తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం, మండల క్రీడా కోఆర్డినేటర్ నందకుమార్, పీడీలు, పీఈటీలు, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.